

ఎదురుగా వున్న అమ్మాయివైపు పరీక్షగా చూశాడు ప్రకాష్.

బ్రౌన్ కలర్ మాక్సీ తొడుక్కుంది. అదే కలర్ డిజైన్ వున్న జాకెట్ వేసుకుంది. చెవులకి చాలా పెద్దవిగా వున్న రింగులు వున్నాయి. కుడిచేతిని వాచీ వుంది. ఎడమచేతికి ఏమీ లేదు. బోసిగా వుంది. బ్రౌన్ కలర్ జుత్తు భుజాలవరకూ కత్తిరించి విరబోసుకుంది. చేతిలో ముద్దుగా వున్న చిన్న పర్సు వుంది.

అత్యాధునికంగా కనిపించే ఆ వేషధారణే కానీ, ఆమెలో ఆకర్షణ ఏమీ లేదు. అయిదడుగులకు మించని ఎత్తు, సామాన్యమయిన శరీరచ్ఛాయ, మామూలుగా కనిపించే రూపం.

ప్రకాష్‌కు అసంతృప్తిగా అనిపించింది. ఇటువంటి అమ్మాయిలు ఏదైనా పల్లెటూరికి వెడితే, వారికి సినిమాతారంగా కనిపించవచ్చుగానీ, అతనికి మామూలుగానే కనపడతారు. అతని దృష్టిలో అందానికి నిర్వచనం వేరే। ఊపిరి

పిల్చుకోవడం ఆగిపోయి, చుట్టూ పరిసరాలను గమనించకుండా ఎవరినైనా నిలబెట్టగలుగుతారో అటువంటి ఆడ వాళ్ళే అందగత్తెలు అనుకుంటాడతను.

అతను అంతకుముందే సెలక్ట్ చేసిన ఇద్దరమ్మాయిలనూ గుర్తుకు తెచ్చుకున్నాడు.

ఐదడుగుల మూడంగుళాల ఎత్తుతో, పాలమీగడ వంటి వన్నెతో, చక్కటి ఉంగరాల జుత్తుతో, అతి పొగరుగా కనిపించే జ్యోత్స్న ఒకమ్మాయి. మరొక సుందరి ఆంగ్లోయిండియన్ యువతి ఎమిలీ! ఒళ్ళంతా ఒంపులతో మెరిసిపోతోంది.

వారి ముందు ఈ అమ్మాయి ఏం పనికివస్తుంది?

నిరాశగా నిట్టూర్చాడు. అతని బాధంతా ఒక్కటే. ఇంటర్వ్యూకి వచ్చిన అమ్మాయిల్లో ఇంకా చాలా అందమైనవాళ్ళున్నారు కానీ, వాళ్ళెవరూ యింత అధునికంగా లేరు. ఒకవేళ ఉద్యోగం యిచ్చినా వాళ్ళు యిలా డ్రెస్‌లు వేసుకుని తిరుగుతారన్న నమ్మకం లేదతనికి.

ఆలోచనలనుండి మెల్లిగా తేరుకున్నాడు ప్రకాష్. ఆ అమ్మాయి యింకా నిలబడే వున్నది.

"ప్లీజ్! సిట్ డౌన్." అతి మర్యాదగా అన్నాడు.

నెమ్మదిగా ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది. టేబిల్‌మీద చేతులు వుంచి, తల కొద్దిగా వంచుకొని,

ఆమె పేరు తెలిసినా, కంఠస్వరం వినాలనే కుతూహలంకొద్దీ అడిగాడు.

"మీ పేరు?"

ఆ అమ్మాయి మెల్లిగా తల ఎత్తింది.

బాగా మేకప్ చేసిన మొహం, పెదవులకి లిప్‌స్టిక్, చిన్న ముక్కు, కళ్ళకి తీర్చిదిద్దిన కాటుకా, మొహాన బొట్టు లేదు.

"నందిత!"

ఆ అమ్మాయి ఎలా చెప్పిందో వినలేదు ప్రకాష్. ఊపిరి బిగపట్టి ఆమె కళ్ళవైపే చూస్తున్నాడు.

ఆ కళ్ళు! పెద్దగా, అందంగా, విశాలంగా లేవు. వాటిలో తళుక్కుమని మెరిసే మెరుపు లేదు.

వాటిని పరీక్షగా చూస్తే, ప్రతి వారికీ కలిగే భావన ఒక్కటే! అది మనసులో ఏ మూలనుండో మెలితిరిగే ఆవేదన!..

నందిత కళ్ళలో పసిపాప కళ్ళలో కనిపించే అమాయకత్వం వుంది. హఠాత్తుగా దడచుకున్నపుడు కలిగే భయం వుంది. పులిని చూసి భయపడే లేడిపిల్ల బెదురు కనిపిస్తోంది ఆ కళ్ళలో.

ప్రకాష్ అంత పట్టి పట్టి చూసినా ఆ కళ్ళలో మార్పేమీ రాలేదు. రెండు

నిముషాల తర్వాత చూపులు తిప్పుకుంది. అంతే!

ఎందువల్లో తెలీదు కానీ వెంటనే నందితకి అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ యిచ్చేశాడు ప్రకాష్.

* * *

నందిత వుద్యోగంలో చేరి నెల కావస్తోంది. ఆ నెల రోజుల్లోను కోపమూ, యిష్టమూ సమానంగా కలిగాయి ప్రకాష్‌కి ఆమెమీద.

కోపం రావడానికి కారణం ఆమె చేసే ప్రతి చిన్నపనీ, అవకతవకగా చేయడం, యిష్టపడటానికి కారణం, ప్రతి రోజూ వేసిన దుస్తులు వేయకుండా అత్యద్భుతంగా అలంకరించుకు రావడం.

ఆమెను మందలించాలని ఎన్నో సార్లు పిలిపించేవాడు ప్రకాష్, ఆమె మీద కోపం వచ్చినపుడు. కానీ ఆమె అతని ఎదురుగా నిలబడి, తల ఎత్తి చూడగానే ఆగిపోయేవాడు. ఆ కళ్ళను చూస్తూ అతను ఆమెను ఏమీ అనలేక పోయేవాడు.

అతనికి పి.ఎ.గ జ్యోత్స్న టూర్‌మీద వెళ్ళినపుడు ఎమిలీ అతన్ని అలరిస్తూ వుండటంతో నందితను పట్టించుకోవడంలేదు. ఆమె కసలు పని కూడా చాలా తక్కువే!

మరో నెల తర్వాత నందిత గురించి ఓ విషయం తెలిసిందతనికి. నందిత ఈ రెండు నెలల నుండీ హోటల్స్‌లో వుంటోంది. ఇప్పటికి మూడు లాడ్జింగ్స్ మారింది.

ఆ హోటల్స్ పేర్లు వినగానే తల తిరిగిపోయింది ప్రకాష్‌కి.

ఎంతలేదన్నా వారానికి వెయ్యిరూపాయల బిల్ దాటుతుంది అంతెందుకు? తనకు యింతజీతం వస్తోంది. తను గడప గలడా ఓ నెలపాటు హోటల్లో?

నో! యింపాజిబుల్!

నందిత దగ్గర చాలా డబ్బు వుండి వుండాలి! లేకపోతే ఎవరూ యిలా ఖర్చు పెట్టలేరు. ఎక్కడినుండి వచ్చిందా డబ్బు?

నాలుగు వందల రూపాయల జీతం కోసం ఈ ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏమిటి? ప్రకాష్ కర్థంకాలేదు.

కొంపదీసి తమ కంపెనీ రహస్యాలు కనుక్కోడానికి వచ్చిన ఏ సి.ఐ.డి.యో కాదు గదా?

నో! నో! అయివుండదు.

అసలు తమ కంపెనీలో ఏమన్నా వుంటే గదా కనుక్కోడానికి?

నందితని పిలిపించి అడిగాడు. ఒకటే జవాబు వచ్చింది.

"మంచి యిల్లు దొరకలేదు సార్!" అని.

అతను ఒకటే నిర్ణయించుకున్నాడు. నందిత ఏ డబ్బున్నవాడినో వలలో వేసుకుని సంపాదించి వుండాలి ఓ

యాష్ట్రేలు! మరొకటి నందిత లగ్జరీ లైఫ్‌కి అలవాటుపడి వుండాలి!

ఈ జవాబుతో అతను తృప్తి పడ్డాడు.

కానీ అతనికి నందితతో ఒంటరిగా గడిపే అవకాశం రానేలేదు. ఎమిలీ, జ్యోత్స్న వుండగా అతనికా అవకాశం రాదు. వాళ్ళు యిద్దరు.

కానీ ఆ ఛాన్స్ అతని స్నేహితుడి కోసారి వచ్చింది. అతను ప్రకాష్‌కి అప్తుడు కనుకా, అతని వల్ల ప్రకాష్‌కి ఎంతో ఉపయోగం వుంటుంది కనుకా ప్రకాష్ నందితని అతని దగ్గరికి పంపించాడు.

రాత్రి పది గంటలు!

కంపెనీ గెస్ట్‌హౌస్‌లో ఓ రూమ్!

సిగరెట్ తాగుతున్నాడు ప్రకాష్!

"ప్రకాష్!"

పక్కగదిలో నుండి స్నేహితుడు గట్టిగా పిలిచేసరికి ఉలిక్కిపడ్డాడు. సిగరెట్ యాష్‌ట్రేలో పడేసి పరిగెత్తాడు.

మంచంమీద నందితని చూడగానే మతిపోయింది.

నందిత కాళ్ళూ, చేతులూ కొట్టుకుంటోంది.

ఆమెకు ఫిట్స్ వున్నాయని అర్థమైంది ప్రకాష్‌కి. వెంటనే డాక్టర్‌కి ఫోన్‌చేశాడు. హాస్పిటల్, మందులూ, హడావిడీ!

"పోయి, పోయి రోగిష్టిదాన్ని పెట్టుకున్నావేం?" వెళ్ళిపోతూ స్నేహితుడు చురకవేసి పోయాడు.

* * *

ప్రకాష్ డైలమాలో పడిపోయాడు.

తానూహించిందంతా కరెక్టయితే నందితకిలా ఎందుకయినట్టు? ఆమెకు డబ్బు ఎక్కడినుంచి వచ్చినట్లు?

ఎన్ని ప్రశ్నలు వేసినా, ఎంత వాకబు చేసినా నందితకు ఎవరూ లేరనే తేలుతోంది.

చిట్టచివరికి అతనో నిర్ణయానికి వచ్చాడు. నందితను ఉద్యోగంలోంచి తీసివేయాలని కాదు.

ఆమె ఎందుకలా వుంటోందో తెలుసుకోవాలని. ఎవరో సలహా యిచ్చారు, నందితని మంచి సైకియాట్రిస్ట్‌కు చూపించమని.

మంచి సైకియాట్రిస్టును వెదికి ఆమెను తీసుకెళదామనుకుంటూండగానే నందితని వెదుకుతూ ఓ వ్యక్తి వచ్చాడు.


వస్తూనే ప్రకాష్‌ను కలుసుకున్నాడు. రాజేంద్ర అతని పేరు.

"రండి! నందిత కేమవుతారు మీరు?" సంతోషంగా ఆహ్వానించాడు ప్రకాష్.

'నందిత' అతను అస్పష్టంగా పలికాడు.

ప్రకాష్ నందిత గురించి తనకు తెలిసిందంతా చెప్పాడు. అంతా విని నవ్వాడు రాజేంద్ర.

"చూడండి మిస్టర్ ప్రకాష్! ఆ అమ్మాయి నందిత చాలా అమాయకురాలి



గానూ, జీవితంలో దెబ్బతిన్నదాని లాగానూ కనిపిస్తోందన్నారు కదూ?"

"అవును, ఏం?" ఆసక్తిగా అడిగాడు ప్రకాష్.

"ఆమె వయసెంతన్నారూ మీరు?"

"ఇరవై ఒకటి!"

చిన్నగా నవ్వాడు రాజేంద్ర.

"ఏం, కాదా?" ఆశ్చర్యపోతూ అడిగాడు ప్రకాష్.

"మీరు నిజంగా చాలా అమాయకులు మిస్టర్ ప్రకాష్! ఆమె మీరనుకున్నంత అమాయకురాలూ కాదు. ఆమె వయసు కంటికి కనిపించేంత చిన్నదీ కాదు." నిట్టూర్చాడు రాజేంద్ర.

"వివరంగా చెప్పండి!" ఆత్రుతగా అడిగాడు ప్రకాష్.

"వివరంగానే చెపుతాను. ఆశ్చర్యపోకుండా వినండి. ఆమె అసలు పేరు రాధ. వయసు ముప్పైరెండు సంవత్సరాలు. ఆమెకి వివాహం అయింది, పదమూడు సంవత్సరాల క్రితం! ఆమె భర్త ఇంజనీర్. కొన్నాళ్ళపాటు ఆనందంగానే గడిచింది వారి కాపురం. వాళ్ళు విదేశాలకు కూడా వెళ్ళారు. కానీ ఎలా తెలిసిందో కొన్నాళ్ళకి ఆమెకు ఓ విషయం తెలిసింది."

"ఏమిటి తెలిసింది?"

"అదే చెబుతున్నాను, తొందర

పడకండి. ఆమెకి తెలిసింది ఏమిటంటే ఆమె భర్త అంతకు ముందే మరో వ్యక్తిని ప్రేమించాడనీ, పరిస్థితుల వలన ఆమెని వివాహం చేసుకోలేకపోయాడనీ ....రాధ హృదయం భగ్గుమంది. ఆమెకి ఈర్ష్య ఎక్కువ. అలాగే అనుమానం కూడానూ. ఇక ప్రారంభమయింది వారి సంసారంలో తుఫాన్‌! రాధ ప్రతిక్షణం, ప్రతిరోజు భర్తను సాంధించి చంపేది. అతను ఏ రోజయినా మాట యిచ్చి తప్పితే చాలు, కాస్త పరధ్యానంగావున్నా పరే చురకల్లాంటి మాటలతో, వ్యంగ్యంగా అతన్ని గాయపరిచేది. పూర్వపు ప్రియురాల్ని మరచిపోలేకుండా వున్నాడనీ, అటువాంటివాడు తననెందుకు పెళ్ళిచేసుకోవాలనీ యిత్యాదు లన్నమాట. ఇలాగే సంవత్సరాలు దొర్లిపోయాయి. వాళ్ళ దేశాలు తిరిగి చివరికి ఇండియా వచ్చేశారు. అంటే సంవత్సరం క్రింద వచ్చారు యిక్కడికి. వచ్చిన వెంటనే రాధకి ఓ ఘోరమయిన విషయం తెలిసింది. అది ఏమిటంటే భర్త ప్రేమించిన అమ్మాయి అక్కడే వుంటూన్నట్లు, ఆమె ఓసారి అతన్ని కలిసి మాట్లాడినట్లు కూడా తెలిసింది. భర్త ప్రాణాలు తీసింది ఆమెని యింటికి తీసుకరమ్మని. అలాగే తీసుకవచ్చాడు. ఆ వచ్చిన ఆవిడని చూడగనే రాధకు మతి చలించింది." రాజేంద్ర ఆగాడు.

"ఎందుకు?" కంగారుగా అడిగాడు ప్రకాష్.

"ఆమె రాధకి ప్రాణస్నేహితురాలు కనుక!"

కొంచెంసేపు నిశ్శబ్దం ఆవరించింది గదిలో.

"తాను భర్తను సాధించినందుకు పశ్చాత్తాపం వల్లనో, మరెందుకో యిదమిత్థంగా కారణం తెలీదు కానీ రాధ అప్పటినుండీ పరధ్యానంగా వుంటూ వచ్చింది. ఇలా ఇష్టం వచ్చిన ప్రతి కంపెనీలకు ఇంటర్వ్యూలకు వెళ్ళి రావడం, చెప్పా పెట్టాకుండాపుణ్యతీర్థాలు తిరగటం అలవాటయింది. ఒక్కోచోట ఒక్కో పేరు మార్చుకునేది. 'వైజయంతి'; 'మాల'; 'షీల' ఇత్యాదులు. అలాగే 'నందిత' కూడాను. ప్రతి ఇంటర్వ్యూలో ఆమె మతి సరిగ్గా లేని మనిషి అని అందరికీ తెలిసిపోయేది. మీరు పొరబడ్డారు, అంతే!" రాజేంద్ర బరువుగా నిట్టూర్చాడు.

ప్రకాష్ హృదయం భారంగా మారింది. అతను నందిత (రాధ) గురించి వివరాలు తెలుసుకోకున్నా బాంగుదేదను కుంటున్నాడు. ఆమె తనకన్నా రెండేళ్ళు పెద్దదనీ, ఆమె కళ్ళలో దీనత్వానికి కారణం, ఆమె జీవితంలో తిన్న ఎదురు దెబ్బలు కాదనీ తెలిసి అతని మనసు విలవిల లాడుతోంది.

హఠాత్తుగా అడిగాడు ప్రకాష్.

"రాధ గురించి ఈ విషయాలన్నీ మీకెలా తెలుసు?"

"నాకు తెలీకపోవటమేమిటి మిస్టర్ ప్రకాష్? రాధ నా భార్య అయితేను...." ప్రకాష్ కొద్దిగా ఆశ్చర్యపడ్డాడు.

"మరి రాధను మెంటల్ హాస్పిటల్‌లో చేర్పించలేకపోయారా?"

"ఎందుకు? ఆమె ఏవిధమయిన పిచ్చి చేష్టలూ చేయదు. తానెవరో ఎక్కడికి వెళ్ళాలో ఆమెకి తెలుసు. ఎన్ని వూర్లు తిరిగినా చివరికి యిల్లు చేరుకుంటుంది. ఈసారి మాత్రం రెండునెలల పైనే అయ్యేసరికి నేను కొంచెం కంగారు పడ్డాను. వెదుక్కుంటూ వచ్చాను. ఆమె క్షేమంగానే వుంది కదా!"

ప్రకాష్ మరేం మాట్లాడలేదు. రాజేంద్ర కొద్దిసేపటికి వెళ్ళిపోయాడు. మరుసటిరోజు నందితనుండి రాజీనామా వచ్చి చేరింది ప్రకాష్‌కు.

* * *

మరో ఆరునెలల తర్వాత ప్రకాష్ రాధను చూడగలిగాడు. అతని కంపెనీతో సంబంధం వున్న మరో కంపెనీలో. దానికి మేనేజర్, ప్రకాష్‌కి వరసకి మామయ్య అవుతాడు.

అతను చంద్రమోహన్, బ్రహ్మచారి. వయసు ముప్పై ఐదు సంవత్సరాల పైనే వుంటుంది.

ప్రేమలో దెబ్బ తిన్నాడనీ, అందుకే పెళ్ళి చేసుకోలేదనీ ప్రకాష్‌కి తెలుసు. అటువంటి చంద్రమోహన్ గదిలో, అతని సెక్రటరీగా రాధను చూసి ఆశ్చర్యపోయాడు ప్రకాష్!

కొంపదీసి మామయ్య కూడా రాధ కళ్ళు చూసి మోసపోలేదు గద!

రాధ అసలు ప్రకాష్‌ను గుర్తుపట్టి నట్లేలేదు. ఆమెను త్వరగా బయటకు పంపించేసి, చంద్రమోహన్‌తో ఆమె గురించి ప్రస్తావించాడు. ఆమె తనదగ్గర పనిచేయడమూ, రాజేంద్ర చెప్పిన ఆమె కథా!

అంతా విని చంద్రమోహన్ నవ్వాడు.

"ఏం, నిజం కాదా?" కంగారుగా అడిగాడు ప్రకాష్.

"నిజమే, కానీ ఆ కథనే రివర్స్‌లో చూడు!"

"అంటే...."

"ఆలోచించు కొంచెం..."

ప్రకాష్ బుర్రలో మెరుపు మెరిసి నట్లయ్యింది.

అవును, నిజమే! అసలు తనెంత మూర్ఖుడు?

"అర్థమయింది!" అన్నాడు తల వూపుతూ.

చంద్రమోహన్ ప్రారంభించాడు.

"రాజేంద్ర రాధనెంత హింసించాలో అంతా హింసించాడు. మగవాడుగా ఆడ దాన్నెంత చిత్రహింస పెట్టాలో అంత చిత్రవధ చేశాడు. నిలబడితే అనుమానం. కూర్చుంటే అనుమానం! చివరికి యిండియా వచ్చేశారు. రాజేంద్ర మాట ప్రకారం రాధ అత్యాధునికంగా తయా రయేది. ఓసారి రాధ ఎవరో ఒక

మగవాడితో మాట్లాడటం దూరంనుంచి చూశాడు రాజేంద్ర। ఇక ఆమె మనో వేదన అధికమయింది, అతని సూటీ పోటీ మాటలతో. ఓసారి రాజేంద్ర తన స్నేహితుణ్ణి తీసుకవచ్చాడు ఇంటికి. రాధని పిలిపించి పరిచయం చేయబోయాడు. రాధ అతన్ని చూడగానే ఫెయింటయి పడిపోయింది. తరువాత ఆమెకు మతి భ్రమించింది." కొంచెం ఆగాడు చంద్రమోహన్.

"అంటే రాజేంద్ర వెంట వచ్చింది ఆమె ప్రేమించిన వ్యక్తి కదూ।"

"అవును। అయితే రాధ పొరబడింది. తనని హేళన చేయడానికే భర్త అతన్ని పరిచయం చేశాడు అనుకుంది. అన్నాళ్ళూ అనుభవించిన మనోవేదనవల్లో, మరెందుకో ఆమె మనసు దెబ్బతింది."

ప్రకాష్ కొంచెం మౌనంగా వున్నాక అడిగాడు-

"అయితే ఈ విషయాలన్నీ నీకు.... నీకు..." ఆగిపోయాడు. అతనికి అప్పటికి స్ఫురించింది.

చంద్రమోహన్ విషాదంగా నవ్వాడు.

"కనుక్కున్నావన్న మాట।"

"సారీ అంకుల్।"

కొంచెంసేపు మౌనం.

"రాజేంద్రకు తెలుసునా, రాధ యిక్కడ పనిచేసే విషయం?"

"తెలుసు. అతను రాధకు విడాకు లిచ్చేసి, విదేశాలకు వెళ్ళిపోయాడు."

"అతను ఎందుకలా రాధమీద వ్యతిరేకంగా కథలల్లి చెప్పడం...."

"సానుభూతి కోసం। తనవల్ల, అనుమానంతో భార్యను పిచ్చిదానిగా చేశాడనే అపవాదునుండి తప్పించుకోవడానికి అల్లిన కథ అది।"

"రాధ నిన్ను గుర్తుపట్టిందా?"

"ఒక్కోసారి గుర్తుపడుతుంది, మరు క్షణంలో మరచిపోతుంది." నిరాశగా వుంది చంద్రమోహన్ కంఠం.

ప్రకాష్ లేచాడు.

"రాధకు త్వరలో మతి భ్రమణం పోతుందనీ, మీరు సుఖంగా వుంటారనీ ఆశిస్తాను అంకుల్। విష్ యూ బెస్టాఫ్ లక్।"

ప్రకాష్ వెళ్ళిపోయాడు.